ఇథనాల్ కంపెనీ మాకొద్దు

- 12 గ్రామాల రైతుల డిమాండ్
- గద్వాల కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- మద్దతు తెలిపిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గద్వాల, నవంబర్ 4 : ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయొద్దంటూ 12గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడ శివారులోని 29 ఎకరాల పంట భూముల్లో గాయత్రి రెన్యూవబుల్ ప్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తుండటంతో రైతులు నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం రైతులు బైఠాయించారు. కంపెనీ నుంచి వచ్చే కాలుష్యం, వ్యర్థాలతో క్యాన్సర్‌తోపాటు శ్వాసకోశ సంబంధిత రోగాలు వచ్చే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. పచ్చని భూములు బీళ్లుగా మారడంతోపాటు సమీపంలోని తుంగభద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందే ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని, కానీ ఏకపక్ష నిర్ణయాలతో నిర్మిస్తున్నారని ఆరోపించారు.

రైతులకు బీఆర్ఎస్ నేతల మద్దతు..

గద్వాల కలెక్టరేట్ ఎదుట ఇథనాల్ కంపెనీ వద్దని ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకొని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, నాయకులు బైకాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్, విజయ్‌కుమార్, పల్లయ్య రైతుల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా వారికి మద్దతు తెలుపుతూ.. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమను రద్దు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇథనాల్ కంపెనీ మాకొద్దంటూ గద్వాల కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలియజేస్తున్న రైతులు

నాగర్‌కర్నూర్‌లో డబుల్ ఇండ్ల కోసం ధర్నా

డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి తాసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో లబ్ధిదారుల పోరాట సంఘం నాయకులు ఆంజనేయులు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు. -కల్వకుర్తి రూరల్

సిరిసిల్లలో ఉపాధ్యాయుల నిరసన

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో విద్యా శాఖ చేపట్టిన అసంబద్ధ సర్దుబాటును వ్యతిరేకిస్తూ గంభీరావుపేట మండల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. -గంభీరావుపేట

నేడు కలెక్టర్లకు ఆర్టీసీ జేఏసీ వినతిపత్రం

హామీల అమలుకోసం కొనసాగుతున్న ఉద్యమం

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్న టీజీఎస్ఆర్టీసీ జేఏసీ ఇప్పుడు పోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. తమ ఉద్యమాన్ని మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలను సమర్పించనున్నది. జిల్లాస్థాయిలో ఆర్టీసీ జేఏసీలు కలెక్టర్లకు వినతిపత్రం అందజేయనుండగా.. హైదరాబాద్‌లో రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని, 2021 వేతన సవరణ అమలు తదితర హామీలను నెరవేర్చాలని జేఏసీ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ డిమాండ్లను పలుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోవడంతో, తాజాగా వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించింది. అయినా స్పందించకపోతే తమ ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకెళ్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు. ఆర్టీసీని అభివృద్ధి చేయని ప్రభుత్వం.. ప్రైవేటు బస్సులను ప్రోత్సహిస్తున్నదని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా కార్మికులకు ఉద్యోగ భద్రతపై బెంగపట్టుకున్నదని తెలిపారు.

సిరిసిల్లలో వర్కర్ టు ఓవర్ లొల్లి..

వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని సిరిసిల్ల నేతన్నలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వర్కర్ టు ఓనర్ పథకానికి సంబంధించిన షెడ్లను ఇతరులకు కేటాయించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ముషం రమేశ్ డిమాండ్ చేశారు. దాదాపు వెయ్యి మంది కార్మికులను యజమానులుగా చేయాలన్న లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం షెడ్లను నిర్మించిందని గుర్తు చేశారు. -రాజన్న సిరిసిల్ల

రా రైస్ మిల్లర్ల కలెక్టరేట్ ముట్టడి

రా రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి అరెస్టుపై సిరిసిల్ల రైస్ మిల్లర్లు నిరసన తెలిపారు. సోమవారం రాత్రి సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పబ్బ నాగరాజు ఆధ్వర్యంలో మిల్లర్లంతా కలెక్టరేట్ వద్దకు తరలివచ్చారు. అనంతరం అక్కడే ధర్నా చేశారు. రా రైస్ మిల్లర్ల సమస్యలు విన్నవించేందుకు ప్రభుత్వ పెద్దల దగ్గరికి వెళ్లిన తమ రాష్ట్ర అధ్యక్షుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని నాగరాజు తెలిపారు. -రాజన్న సిరిసిల్ల

కొడుకు నుంచి భూమి వాపస్

- తండ్రిని సరిగా చూడనందుకు చర్యలు
- సీనియర్ సిటిజన్ యాక్టుతో భూమి బదలాయింపు
- హనుమకొండ జిల్లాలో ఘటన

రాజకొమురయ్యకు పాస్‌బుక్కు అందజేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్

భీమదేవరపల్లి, నవంబర్ 4: తండ్రి నుంచి ఆస్తి పొందిన కొడుకు ఆ తరువాత సరిగ్గా చూడకపోవడంతో సదరు తండ్రి తన ఆస్తిని తిరిగి సొంతం చేసుకున్నారు. సీనియర్ సిటిజన్ యాక్టు ద్వారా సదరు ఆస్తిని తిరిగి పొందారు. ఈ ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకున్నది. భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్‌కు చెందిన మద్దెల రాజకొమురయ్య, మల్లమ్మ దంపతులకు కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరందరికీ పెళ్లిళ్లు జరగ్గా.. ఆరేళ్ల క్రితం మల్లమ్మ మృతి చెందింది. తండ్రి 4.12 ఎకరాల వ్యవసాయ భూమిని కుమారుడు రవికి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశాడు. రవి అప్పటి నుంచి తండ్రిని పట్టించుకోవడం మానేశాడు. దీంతో రాజకొమురయ్య పెద్దమనుషులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. పైగా తండ్రిపై చేయి చేసుకోవడంతో మానసికంగా కుంగిపోయాడు. తన కుమారుడికి ఇచ్చిన భూమి పట్టాను రద్దు చేయాలని హనుమకొండ ఆర్డీవో, ముల్కనూరు పోలీసులకు అర్జీ పెట్టుకున్నాడు. అనంతరం తనువు చాలిద్దామని సిద్ధమై హసన్‌పర్తి మండలంలోని ఒక గ్రామానికి చెందిన గుట్టల్లో ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిపోయాడు. అక్కడ గొర్ల కాపరులకు రాజకొమురయ్య కనిపించడంతో అతన్ని చేరదీసి నెలరోజులపాటు వారే సాకారు. అనంతరం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పెద్ద పాపయ్యపల్లిలోని ఓ రైస్‌మిల్లులో వాచ్‌మెన్‌గా చేరాడు. విషయం తెలుసుకున్న హనుమకొండ ఆర్డీవో, భీమదేవరపల్లి తహసీల్దార్ విచారణ చేపట్టి రాజకొమురయ్య కొడుకుకు ఇచ్చిన పట్టాను రద్దు చేశారు. తిరిగి తండ్రికే పట్టా అందజేశారు. రాజకొమురయ్య ఇంటికి వెళ్తే కొడుకు దాడి చేయవచ్చనే అనుమానంతో అతనికి రక్షణ కల్పించాల్సిందిగా ముల్కనూరు ఎస్సై సాయిబాబును ఆదేశించినట్టు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నేడు ఆటోడ్రైవర్ల మహాధర్నా

- ఆంక్షల మధ్యే నేటి మహాధర్నాకు అనుమతి
- బీఆర్‌టీయూ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మారయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్క్ స్టేడియంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మహాధర్నా నిర్వహించబోతున్నట్టు బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య తెలిపారు. అనేక ఆంక్షల మధ్య పోలీసులు మహాధర్నాకు అనుమతిచ్చినట్టు చెప్పారు. 200 మందికి మించకుండా ధర్నా చేపట్టాలని సూచించినట్టు చెప్పారు. ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు.. ఆటోడ్రైవర్ల సమస్యలు చెప్పుకునేందుకు ధర్నా చేపడితే డ్రైవర్లు పరిమిత సంఖ్యలో రావాలని సూచించడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపాధి కరువై ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడం దుర్మార్గమని తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఏడాదికి రూ.12 వేలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

లంచంలో వాటా కోసం కొట్టుకున్న కానిస్టేబుళ్లు!

- నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో ఘటన

నెక్కొండ, నవంబర్ 4: వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు లంచం డబ్బుల కోసం ఘర్షణ పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ విషయం సోషల్ మీడియాలో సోమవారం వైరల్ అయ్యింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కొన్ని రోజుల కిందట నెక్కొండ ఎస్సై మహేందర్ సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ బాధ్యతలను ఓ హెడ్‌కానిస్టేబుల్‌కు అప్పగించారు. అతడు ఓ ఫిర్యాదుదారుడి నుంచి రూ.వెయ్యి లంచం తీసుకున్నాడు. మరో హెడ్ కానిస్టేబుల్ తన వాటా అడగడంతో గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నట్టు సమాచారం. ఈ ఘటన అక్టోబర్ 27న జరగ్గా, సీఐ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. వారు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉన్నది. కాగా, డ్యూటీల విషయంలో ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల ఘర్షణ పడినట్టు పోలీసులు చెప్పుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

పోలీస్ ఆంక్షలను ఉపసంహరించాలి

- వామపక్ష నేతల డిమాండ్
- 15నుంచి రాష్ట్రవ్యాప్త ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదంటూ కొత్త పోలీస్ చట్టంలోని సెక్షన్ 163 ద్వారా విధించిన నిషేధాజ్ఞలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు 10 వామపక్ష పార్టీల నేతలు పేర్కొన్నారు. ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో జరిగిన సంయుక్త సమావేశంలో వామపక్ష నేతలు మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ తదితర శక్తులు రాష్ట్రంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులను ప్రోత్సహిస్తున్నాయని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మత సామరస్యాన్ని కాపాడేందుకు ఈ నెల 15 నుంచి డిసెంబర్ 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సీపీఐ ఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు జేవీ చలపతిరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, నరసింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఆర్టీసీ 'స్పెషల్' బాదుడు

- ప్రత్యేక బస్సుల పేరిట అధిక చార్జీలు
- ఆర్టీసీ తీరుపై ప్రయాణికుల ఆగ్రహం
- 'స్పెషల్' చార్జీలను సవరించామన్న ఆర్టీసీ

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): ప్రయాణికులపై ఆర్టీసీ పెను భారం మోపుతున్నది. రద్దీని ఆసరాగా చేసుకొని స్పెషల్ బస్సుల పేరిట అధిక చార్జీలను వసూలు చేస్తున్నది. పండుగల నేపథ్యంలో ప్రత్యేక బస్సులంటూ అడ్డగోలుగా టికెట్ ధరలు పెంచుతుండటంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

పండుగలు ముగిసినా అవే చార్జీలు..

బతుకమ్మ, దసరా సందర్భంగా వారంపాటు ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేసిన విషయం తెలిసిందే. దీపావళికీ అదే సీన్ రిపీట్ అయ్యింది. పండుగ ముగిసినా స్పెషల్ చార్జీలు వసూలు చేయడం గమనార్హం. ఆదివారం కరీంనగర్ -2 డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా అధిక చార్జీ వసూలు చేయడంపై ప్రయాణికులు తిరగబడ్డారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్(జేబీఎస్)కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కిన ఓ ప్రయాణికుడు టికెట్ ధర చూసి కంగుతిన్నాడు. సాధారణంగా జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సూపర్‌లగ్జరీ బస్సులో రూ.330 చార్జీగా ఉంది. కానీ ఆదివారం కరీంనగర్ డిపో బస్సు ఎక్కిన ప్రయాణికుల నుంచి రూ.470 వసూలు చేశారు. ఇదేమిటని ప్రయాణికులు బస్సు డ్రైవర్‌ను నిలదీయగా రద్దీ ఎక్కువగా ఉండటంతో స్పెషల్ బస్సులు నడుపుతున్నామని, టికెట్ మిషన్‌లో రూ.470 ఫిక్స్ చేశారని సమాధానం చెప్పాడు. దీంతో టికెట్ రేట్ల తేడాలను చూపుతూ కొందరు ప్రయాణికులు వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆర్టీసీ స్పెషల్ చార్జీల వసూలుపై నెటిజన్లు సైతం మండిపడుతున్నారు. ఇదే విషయమై ఆర్టీసీ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. బస్సు టికెట్ ధరల పెంపుపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నది. రెగ్యులర్ సర్వీసులకు సాధారణ చార్జీలే అమల్లో ఉన్నట్టు తెలిపింది. 2003లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 16 ప్రకారం పండుగ, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో రూ.150వరకు టికెట్ ధరను సవరించుకునే వెసులుబాటు సంస్థకు ఇచ్చిందని పేర్కొన్నది. అందులో భాగంగానే స్పెషల్ బస్సులో చార్జీ వసూలు చేసినట్టు స్పష్టం చేసింది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం దివాలా

- రేవంత్‌కు దమ్ముంటే రుణమాఫీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జికి నివేదిక ఇవ్వాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ పార్టీ వ్యవహారం 'ప్రచారం ఫుల్.. పనులు నిల్' అన్న చందంగా తయారైందని విమర్శించారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు హామీని కూడా సరిగా అమలుచేయలేదని పేర్కొన్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలకు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్తు ఉత్పత్తి ఇబ్బందికరంగా మారిందని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల పేరుతో అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వారిపై లాఠీలతో దాడి చేయిస్తున్నారని మండిపడ్డారు. 17 పంటలకు మద్దతు ధరతోపాటు బోనస్ ఇస్తామని చెప్పి కేవలం సన్న వడ్లకు మాత్రమే అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నదని విమర్శించారు. 38.63 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉండగా, 22 లక్షల మందికే చేశారని, అయినా రాహుల్ గాంధీ మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో అబద్ధాలు చెప్పున్నారని ఆరోపించారు. రేవంత్‌కు దమ్ముంటే రుణమాఫీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జికి నివేదిక సమర్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలతో రైతు భరోసా కల్పిస్తామని చెప్పి అమలుచేయలేదని మండిపడ్డారు.

'ఓటుకు నోటు' కేసు మరో బెంచ్‌కి బదిలీ

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసులో కీలక పరిణామం చోటుచేసుకున్నది. ప్రస్తుతం ఈ కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టు ధర్మాసనం నుంచి వైదొలుగుతున్నట్టు జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ సోమవారం వెల్లడించారు. గతంలో ఆయన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసినందున విచారణ నుంచి వైదొలుగుతున్నట్టు తెలిపారు. దీంతో ఈ కేసును మరో ధర్మాసనానికి బదిలీ చేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న జెరూసలేం మత్తయ్య.. అమికస్ క్యూరీ స్థానంలో మరో న్యాయవాదిని నియమించుకున్నారు. ఆ విషయాన్ని సోమవారం మత్తయ్య తరపు న్యాయవాది సుప్రీంకోర్టు ధర్మాసనానికి నివేదించారు.

రోడ్లకు నిధులివ్వండి మహాప్రభో !

- ఆర్‌అండ్‌బీకి ఎమ్మెల్యేల వినతులు
- 15,000 కోట్లు దాటిన అంచనాలు

హైదరాబాద్, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): కొత్త రోడ్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతు పనుల కోసం ఆర్‌అండ్‌బీ శాఖకు ఎమ్మెల్యేల నుంచి భారీగా వినతులు వస్తున్నాయి. ఒక్కో నియోజకవర్గం నుంచి రూ.50 కోట్ల నుంచి రూ.300 కోట్ల మేర ఖర్చయ్యే పనుల కోసం వినతులు అందినట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి. ఆయా పనుల మొత్తం విలువ రూ.15,000 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. రాష్ట్రంలో ఏడాది క్రితం అసెంబ్లీ ఎన్నికల కోడ్ మొదలైనప్పటి నుంచి రోడ్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పూర్తయిన రోడ్లకు బిల్లులు చెల్లించకపోగా, కొత్త పనులను మంజూరు చేయడం లేదు. దాదాపు రూ.1,000 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. ఈ నేపథ్యంలో అనేక నియోజకవర్గాల్లో కొత్త రోడ్లు, కల్వర్టుల నిర్మాణం కోసం ఎమ్మెల్యేల నుంచి భారీగా వినతులు వస్తున్నాయి. నిత్యం ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు ఇటు ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి, అటు సచివాలయంలోని మంత్రి కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల నుంచి ఎక్కువగా ప్రతిపాదనలొచ్చాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా ఎక్కువగా నష్టపోయిన జిల్లాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు కోరుతున్నారు. దీంతో ఒక్కో నియోజకవర్గానికి రూ.50 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది.

దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు నిధులు సున్నా

రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో సుమారు 2,553 కిలోమీటర్ల మేర రోడ్లు, 902 హైలెవల్ వంతెనలు, 391 కల్వర్టులు, 166 వంతెనలు దెబ్బతిన్నట్టు రోడ్లు, భవనాల శాఖ అధికారులు గుర్తించారు. తాత్కాలిక పనులకు రూ.100 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.2,462 కోట్లు కావాలని ఆర్‌అండ్‌బీ శాఖ ప్రతిపాదించగా, ప్రభుత్వం రూ.15 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఇవి కనీసం తాత్కాలిక మరమ్మతులకు కూడా సరిపోలేదు. కాగా, ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం రోడ్లకు భారీగానే నిధులు కేటాయించినప్పటికీ, విడుదలకు మాత్రం నోచుకోవడం లేదు. బడ్జెట్‌లో ప్లాన్ నిధుల కింద రూ. 518 కోట్లు, నాన్ ప్లాన్ కింద రూ.888 కోట్లు కేటాయించింది. అంతేకాకుండా స్పిల్‌ఓవర్ నిధులు కూడా భారీగానే బడ్జెట్‌లో చూపించారు. కాగా, రోడ్లకు ఇంత భారీ నష్టం జరిగినా నిధులు విడుదల చేయలేదు.

ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

ఎన్నికల కమిషన్‌కు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): రానున్న ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్)లకు ఓటు హక్కు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి సోమవారం లేఖ రాశారు. ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు రాష్ట్రంలో 80 శాతం ఉన్నారని, వారిని ఓటు హక్కుకు దూరంగా ఉంచడం సరికాదని లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 171వ ఆర్టికల్ ప్రకారం ఏర్పడిన మండలిలో తమ సమస్యలు పరిష్కరించుకొనుటకు ప్రతి ఉపాధ్యాయుడికి ఓటు హక్కు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గ స్థానానికి ప్రతి పట్టభద్రుడికి ఉన్నట్టే ఉపాధ్యాయ ఎన్నికల్లో ప్రతి ఉపాధ్యాయుడికి ఓటు హక్కు ఉండాలని తెలిపారు.

'మార్గదర్శి'కి చుక్కెదురు

గ్యాగ్ ఆర్డర్ జారీకి హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): మార్గదర్శి చిట్ ఫండ్ కంపెనీకి కోర్టులో చుక్కెదురైంది. ఆ సంస్థ గురించి మాట్లాడకుండా ఉండేలా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితరులకు ఉత్తర్వులు ఇవ్వాలన్న అభ్యర్థనను హైకోర్టు సోమవారం తిరస్కరించింది. ప్రస్తుతం తమ ముందున్న పిటిషన్‌పై విచారణ చేపట్టకుండా గ్యాగ్ ఆర్డర్‌ను ఇవ్వలేమని జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 7కు వాయిదా వేసింది.

'నారాయణ'లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

బొల్లారం, నవంబర్ 4: నారాయణ కళాశాల క్యాంపస్‌లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. బొల్లారం సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా గరిమెళ్లపల్లికి చెందిన బాలబోయిన పరుశురామ్ కూతురు వైష్ణవి (16) కాజీపల్లి శివారులోని నారాయణ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్ చదువుతున్నది. కళాశాల హాస్టల్‌లో సోమవారం సాయంత్రం ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. కళాశాల యాజమాన్యం గుర్తించి బాచుపల్లిలోని ఓ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. సీఐ గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకోని ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

- మూడు రోజుల్లో మరో 30 మందికి అస్వస్థత
- భయంతో ఇంటిబాట పడుతున్న మిగతా బాలికలు

వాంకిడి, నవంబర్ 4: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గతనెల 30న వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన 30 మంది విద్యార్థినులు చికిత్స పొందుతుండగా గత రెండు, మూడు రోజుల్లో మరో 30 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంకిడి ప్రభుత్వ దవాఖానాలో సోమవారం 18 మంది, ఆశ్రమోన్నత పాఠశాలలో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. మరికొంతమందిని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో శైలజ, మహాలక్ష్మి, జ్యోతిక ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. దీంతో మిగతా విద్యార్థినులు భయాందోళనకు గురై ఇంటి బాట పడుతున్నారు. ఆశ్రమంలో 590 మంది విద్యార్థినులు ఉండగా ప్రస్తుతం 95 మంది మాత్రమే ఉన్నారు. బయట ఫుడ్ తెచ్చుకొని తినడం వల్ల ఇలా జరిగిందని హెచ్ఎం, వార్డెన్ చెబుతుండగా నాణ్యత లేని రంగు మారిన భోజనం తిన్న తర్వాతే అస్వస్థతకు గురైనట్టు విద్యార్థినులు తెలిపారు. ఐద